# సదసత్సంశయం

శ్రీ శ్రీ

౪

జ్ఞానులు బోధిస్తూ బ్ర
హ్మానంద మహాజ్ఞానస
విశదమనీ అనుభవైక్య
వేద్యమనీ నుడివినారు

జపంవల్ల తపంవల్ల
ప్రపంచాన్ని మరిచిపోయి
భగవంతుని ధ్యానంలో
పడిపొమ్మని పలికినారు

మంచి చెడ్డలను కొలిచే
మానదండమట దైవం
ఈశ్వరు డొకడే సత్యం
ఇతర సమస్తం మిథ్యట

ఇంద్రియాలద్వారా మన
కీ సత్యం తెలియదంట
విశ్వాసం తప్ప మనకి
వేరే సాక్ష్యం లేదట

౫

అగుపించనిదేదో ఒక
ఆత్మ పదార్థం కలదట
అన్నీ పోవచ్చుగాని
అదిమాత్రం చావదంట

నిప్పు దాన్ని కాల్చలేదు
ఛిందించగలేదు కత్తి
నీరు దాన్ని ముంచలేదు
గాలి దాన్ని చెనకదంట

జన్మలనీ కర్మలని
చాలాదూరం వెళ్లిన
ఆలోచనలన్నీ ఈ
ఆత్మ చుట్టు అల్లినవే

ఏ తదాత్మ సర్వేషాం
సర్వత్రా ఆవరించి
సర్వస్వం తానే ఐ
శాసిస్తుందంట జగతి

౬

పుణ్యాపాప నిర్ణేతలు
నీత్యా వినీతిజ్ఞ విజ్ఞు
లస్తి నాస్తి విచికిత్సకు
లంతమంది యేమన్నా

ఇదిమాత్రం నే నెరుగుదు
నెంతమంది యేమన్నా
తథ్యం ప్రాణికి మృత్యువు
తప్పదు జీవికి వేదన

జడిగొల్పే దుఃఖంలో
తడియకుండ గొడుగులేదు
ఆనందాలన్నీ తుద
కంతమొందు నొక సమాధి

మనుజునిలో మరణ భీతి
మదిలో దుఃఖానుభూతి
ఆలోచనలన్నిటికీ
అంతర్యంలో పునాది

(సశేషం)